# 46. కెన్ ఐ బి ఆఫ్ సమ్ హెల్ప్?

ఏ ఒట్టు పడితే ఆ ఒట్టు.

మీరు నమ్మండి మానకపొండి.

నిజంగా నేను రాసింది ఈ ఒక్క వాక్యం మాత్రమే.

అదైనా ఎప్పుడు?

వరసగా ఓ అరడజను ఉత్తరాలు వచ్చి గూటించి ఒదిలి పెడుతూంటే, జవాబు రాయవేం అని నిలదీసి అడుగుతూ ఉంటే, ఏదో ఒకటి రాయాలి గదా అని, ఉండబట్టలేక, యాథాలాపంగా రాసిన ముక్క అది. అనుకోకుండా పడిన మాట అది.

అయితే నేం?

కొంపలంటుకున్నాయి.

బ్రహ్మాండ భాండాలు బ్రద్దలయిపోయాయి!

కార్డు అడ్డంగా తిప్పి అప్రయత్నంగా రాసిన యీ నాలుగు ముక్కల ఇంగ్లీషు వాక్యమూ మా యిద్దరి స్నేహానికీ మంగళ హారతి పాడేస్తుందని కలలో కూడా అనుకోలేదు!

వెంటనే దానికి వచ్చిన జవాబు చూస్తే 'తావుల్ దప్పెను' అనిపించింది.

ఆరు అర తావుల ఉత్తరం అది మరి!

అది చదివేక.............

మొదట చాలా కంగారు పడిపోయాను.

తర్వాత నిలదొక్కుకున్నాను.

ఆఖర్ని నవ్వుకున్నాను.

అది దాచుకోవలసిన ఉత్తరం కాదు.

ఎక్కడ పడేశానో జ్ఞాపకం లేదని విచారించవలసింది కూడా అందులో యేం లేదు.

మొదట్నుంచి చివర వరకు నన్ను తిట్టడం తప్ప అందులో మరేం లేదు.

చివర్ని మాత్రం సుబ్బారావు దాన్ని ఇలా ముగించినట్టు గుర్తు:

"లోకంలో నాకు జరిగిన అన్యాయాలు తలుచుకు ఏడవడానికి నిజంగా నాకు ఒక జన్మంటూ చాలదు. మంచీ చెడ్డా తేడా గుర్తించలేని పిచ్చి వెధవలు నా ప్రతిభను గమనించక నన్ను ఆడి పోసుకుని అష్ట కష్టాల పాలు చేశారంటే అది ఎలాగైనా భరించవచ్చు. నాకెంతో తెలిసిన వాళ్ళే. దగ్గిర వాళ్ళే వెన్ను పోటు పొడిస్తే మాత్రం నేను సహించలేకపోతున్నాను. అలాంటిది ఎప్పుడో చిన్నప్పుడు కలసి చదువుకున్న వాళ్ళం. ఇన్నేళ్ళ తర్వాత కలుసుకున్నాం కదా అని, నాకు మనసుకి కలిగిన కష్టాన్ని ప్రాణ స్నేహితుడివి గదా అని నీకు విప్పి చెప్పుకున్నాను. ఇన్నాళ్ళూ మౌనం వహించి అనాదరణ చేశావు. ఇన్నాళ్ళకు నీ

నుంచి జాబు వచ్చింది కదా అని గంపెడాశతో చదవబోతే ఏముంది? ఒక్కటే వాక్యం అయితే నేం, నీ అంత తెలివైన వాణ్ణి కాకపోవచ్చు గాని నువ్వు అనుకున్నంత అమాయకుణ్ణి కాను.

అందులో అపహాస్యం గుర్తించలేదనుకున్నావా!

ఆ వాక్యంలోని అశ్లీలం బోధ పడలేదనుకున్నావా!

ఛీ!

ఇంతటితో నీకూ నాకూ సరి.

నీ ఉత్తరం కాదు నీ మొహం చూడ్డం సహా మహా పాపంగా భావిస్తున్నాను. అంతే."

అయ్యా, ఆపండీ ఆఖరి ముక్కలు, ఏం చెప్పమన్నారు!

ఇంతకీ సంగతి బోధ పడాలంటే మా ఇద్దరి గురించీ క్లుప్తంగానైనా చెప్పుకోవాలి.

చిన్నప్పుడు కనీసం పదేళ్ళ వరకైనా అమ్మ సంరక్షణ మనిషికి కావలసి ఉంటుంది.

అదో తీపి గుర్తు.

ఆ పదేళ్ళ తీపిదనమూ బతుకంతా గుర్తు చేసుకుంటూ ఉంటాడు మనిషన్న వాడు.

బాగా చిన్నప్పుడు ఏర్పడ్డ స్నేహాలూ అంతటి మాధుర్యం నింపుకున్నవే.

సుబ్బారావూ నేనూ మెట్రిక్ దాకా మా వూరి హైస్కూల్లో చదువుకున్నాం.

ఆ తర్వాత మరో పాతికేళ్ళ పాటు గుర్తుంచుకోడానికి అంత బలమైన ఆకర్షణ వాడిలో నాకేం కనిపించిందో ఇప్పుడు చెప్పడం నాతరం కాదు.

ఒకటి మాత్రం చెప్పగలను.

ఆ అయిదేళ్ళ పాటూ మేం యిద్దరమే కాక ఇంకో అయిదారుగురం ఓ గ్రూప్‌లా ఎప్పుడూ తిరుగుతూ ఉండే వాళ్ళం. బతుకుతెరువు కోసం ఎవరికి వారు విడిపోయినా అప్పుడప్పుడు కామన్ ఫ్రెండ్ ఎవరో ఒకరు కనపడి సుబ్బారావు కబురు చెవిని వేస్తూండే వారు.

'మనతో చదువుకున్నాడు డి. సుబ్బారావు గుర్తున్నాడా! వాడికి కిందటేడు పెళ్ళయిపోయిందిట. నువ్వు విన్నావో లేదో..... బాబ్జీ సామర్లకోట ప్లాట్‌ఫారం మీద కనపడి చెప్పేడులే...... మనకి తెలియనిచ్చాడు కాదు. ఎంతో అమాయకుడిలా కనిపించే వాడుగాని ఉత్తి కుళ్ళుబోతు సుమీ!' ఇలా ఓ కబురూ.

'వాణ్ణి అక్కకి పెంపకానికి యిచ్చారు. జ్ఞాపకం ఉండే వుంటుంది. ఇటు ఆవిడ ఆస్తీ, అటు కప్పెట్టినంత తండ్రి ఆస్తీ అన్నీ మన సుబ్బారావు గాడివే. ఇవిగాక చిన్నప్పుడే ఎక్సైజ్ డిపార్టుమెంటులో ఉద్యోగం సంపాదించుకున్నాడుట. పైగా మనలా అధిక దిగుబడి వంగడం రకం కాదు అతని పెళ్ళాం. ఒరే నాకు తెలీకడగుతానూ, చచ్చినంత సంపాదనా, పరిమితమైన సంతానమూ వున్నా ఎప్పుడూ చవక రకం అద్దంలో చూసుకున్నట్టు ఉంటుందేం మన సుబ్బారావ్ మొహం?'

అలా ఓ కబురూ వాణ్ణి గురించి నాకు అందుతూనే ఉండేవి. ఎవరు చెప్పినా, ఎందుచేతో

మరి, చెడుగానే చెప్పేవారు.

'ఏమండీ చూశారా మీ అమ్మ ఎంత ఘోరం తల పెట్టిందో?' అని ఏ కోడలయినా కొడుక్కి చేరేసిందనుకోండి. సాధారణంగా ఏకొడుకూ ఆ మాట నమ్మడు. అమ్మ అనేది ఘోరం తలపెట్ట గలదని అతని మనసుకి తట్టదు గనక.

ఇంచుమించు అలాంటి కారణం చేతనే అనుకుంటాను. సుబ్బారావు గురించి ఎవరెన్ని చెప్పినా వాడిమీద ప్రేమ నాకు హెచ్చుతూనే వచ్చింది. చూడాలనే కోరిక పెరుగుతూనే వచ్చింది. ఆఖరికి కాకతాళీయంగా ఆ కోరిక తీరింది కూడా.

కిందటేడు ప్రసాద్‌ని సైనిక్ స్కూల్లో చేర్పించి రిటర్న్ అవుతున్నప్పుడు రైల్లో వాణ్ణి కలిశాను. పాతికేళ్ళలో యాభై ఏళ్ళ మార్పు వచ్చింది వాడికి. వాడు నన్ను చూడలేదు. పై బెర్త్‌మీద పడుకున్న వాణ్ణి కిందకి చూసినా వాణ్ణి గుర్తుపట్టే అవకాశం నాకు లేదు. వాడికి కాస్త నత్తి ఉంది. కొన్ని కొన్ని అక్షరాలు పలకక అందరూ ఏడిపించే వాళ్ళు. ఎదుట మనిషిని అలా గాలికి ఒదిలేసి తన ధోరణిలోనే అలా సంభాషణ సాగించడం వాడికి అలవాటు. అదిగాక వాడు ఆ ప్రాంతాలకే బదిలీ ఐనట్టు విన్నాను. వీడుగాని సుబ్బారావు కాదు కదా! అనుకుని ఏమైతే అయింది శరీరమంతా ఉండగా నోటిమీద కొట్టడు గదా! అని అడిగేశాను.

వాడు మా డి. సుబ్బారావుగాడే.

తర్వాతి స్టేషనులో వాడు దిగిపోతేనేం. పెద్ద గిన్నెడు పరవాన్నం కలపడానికి మూరెడు గరిట చాలు. గుండెల నిండా ఎంత తీపి నింపుకున్నామో......

'నా రోజులేం బాగులేవు. ఏదో ఓటి రాస్తూంటాను. చాదస్తం కింద జమకట్టక జవాబు రాస్తూండు' అన్నాడు తన స్టేషన్లో దిగిపోతూ.

నా గుండెల్లో రాయి పడింది. అయిదొందల పేజీల పుస్తకాన్నయినా భళ్ళున తెల్లారకుండా పూర్తి చెయ్యగలను. ఉత్తరం రాయడమంటే మాత్రం నాకు చచ్చీ చావే. నా వల్ల కాదే, ఏం దారి!

ఇవన్నీ ఆలోచించుకు కూచుంటే రైలాగుతుందా. తల ఊపేశాను.

అదిగో నండీ అప్పట్నుంచీ మొదలెట్టేడు 'ఉత్తర' క్రియలు!

'నాకు ఒక్క కొడుకు' మొదటి ఉత్తరంలో మొదటి వాక్యం. అదేదో అంతర్జాతీయ ప్రాముఖ్యం గల న్యూస్ ఐటమ్ అయినట్టు పోనిద్దా, మొదట్నించీ అమాయకపు ప్రాణి కాస్త జాలి చూపిస్తే నేనేం నష్టపోయింది లేదు. అని సరిపెట్టుకుందామన్నా నా మంచితనాన్ని వాడు నిలబడ నివ్వలేదు.

'ఇంతటి మానవకోటి గల యీ లోకంలో చిటికెడు సానుభూతికి మొహం వాచి నేను ఉత్తరం రాస్తున్నానని నువ్వు గుర్తించినట్లు లేదు. పోనీ ఒకడు కాకపోతే మరొకడు ఉంటే ఇంతగా చింతించడానికి నాకూ అవసరం లేకపోను. నాకు ఒక్కగా నొక్క కొడుకు. ఒక్కడే సుమా!' అనే ధోరణిలో మరోసారి రాశాడు. ఎంత ఆలోచించినా అందులో ముంచుకొస్తున్న ఆపద నాకు బోధ పడలేదు.

ఇంతలో మరో పిడుగులాంటి వార్త. 'కూతుళ్ళు గాని నాకు వున్నారేమో అని నువ్వు తప్పు అభిప్రాయంలో ఉన్నావు కాబోలు. అంతటి భాగ్యానికి యీ దీనుడు నోచుకోలేదు.'

వీడెంత పిచ్చి ముండాకొడుకు, వీడి సంతానం గురించి ఆలోచించడం తప్ప లోకంలో ఇంకెవరికీ ఏపనీ లేదనుకున్నాడా అని ఆశ్చర్యపోబోయి అంతలో లెంపలు వేసుకున్నాను వాడి బాధలు లోకంముందు వెళ్ళబోసుకోడం లేదు. ఎన్నాళ్ళకో కనిపించిన ఆత్మీయుడితో తన భావాలు పంచుకోడం తప్పా?

రైల్లో కనిపించిన ఆ అరగంటలో తను వర్తమానంలో పడుతున్న ఎన్నో యిబ్బందుల్ని వివరంగా చెప్పడమే గాక 'వచ్చే కొత్త అమావాస్య నుంచీ నా జాతకం రెండేళ్ళ పాటు బాగుండదుట, ఏం గొడవలు వస్తాయో ఏమో! ఏప్రిల్ నుంచీ ఆర్నెల్లపాటు మాకు జీతాల్వీరని విన్నాను. ఇలాగైనా వుండకుండా ఇంకా ఎన్నెన్ని పరీక్షలకి తట్టుకోవాలో యీ జీవుడు' లాంటి ఏడ్వాన్సు ఏడుపులు కూడా జోడించాడు. టైము చాలకో ఏమో ఎక్కడా కొడుకు ప్రసక్తిరాలేదు అప్పుడు. నా ఊహలన్నీ ఆ కొడుకు చుట్టూ తిరిగేయి.

ఎందుకు చెప్మా యిన్నిసార్లు కొడుకు కొడుకో అని రాస్తున్నాడు? తన కిప్పుడు నలభై అని చెప్పేడు. ఆ కొడుకు బహుశా ఆలశ్యంగా పుట్టి ఉంటాడు. ఇక సంతాన ప్రాప్తి లేదని డాక్టర్లు చెప్పి వుంటారు. ఆ ఒక్క నలుసూ మూడొంతులు బెడ్ రిడెన్ అయివుంటాడు. ఏ పోలియోనో అయివుంటుంది. అందుకే అంత బాధపడుతూ రాస్తున్నాడేమో అని సానుభూతితో నిండిపోయింది నా మనసు. వెంటనే వివరాలు అడుగుతూ ఉత్తరం రాయాలని అవాళే నిశ్చయించుకున్నాను. కాని చెప్పేనుగా 'సామాన్యుడి ప్రగతి కోసం దేశ నాయకులైనా పాటు.పడగలరు గాని లెటరు రాసి పోస్టు చ్యెడం నా పట్ల అసంభవమని' ఇవాళో రేపో రాద్దాం అనుకుంటూ రెండో మూడో వారాలు మాత్రమే నేను దొర్లించగా నే కోరినా భోగట్టా అడక్కుండానే నన్ను చేరుకుంది.

'నీది కూడా ఇంతటి కఠిన హృదయం అని నేను అనుకోలేదు. ఎవర్నీ ఏమీ ఆశించక ఒంటిచేతితో ఎన్ని కష్టాలనైనా ఆదుకున్నాను. వెక్కిరించిన వాళ్ళు కొందరు. వేళాకోళం చేసిన వాళ్ళు కొందరు. నన్ను అర్థం చేసుకునే వ్యక్తి ఒక్కరంటే ఒక్కరు కూడా దొరకలేదు.

ఆరోజు రైల్లో ప్రాణం పెట్టేవు. నాలో ఎన్నో ఆశలు రగిలించావు. నువ్వూ. ఇంతేనా? నా ఉత్తరం అందిందనై నా రెండు ముక్కలు రాసిపడెయ్యడానికి నీకు తీరిక లేకపోయిందా! వేదన నిలువెల్లా దహించి, గుండెల్ని పిప్పి పిప్పి చేసే పరిస్థితి వస్తేగాని ఒకరితో మనసు విప్పి చెప్పుకునే అలవాటు నాకులేదు. నువ్వెందుకు మాట్లాడవు? ఒకవేళ నా పరిస్థితి నేనే సరిగా వివరించలేకపోయానేమో అని ఆఖరి ప్రయత్నంగా ఈ ఉత్తరం రాస్తున్నాను.

ఓ కన్ను కన్ను కాదు, ఓ బిడ్డ బిడ్డ కాదు అంటారు మనవాళ్ళు. ఆ బాధంతా యిప్పుడు తెలుస్తోంది. నాకు వచ్చిన కష్టాలు పగవాళ్ళకి కూడా వద్దు. ఎందరికో మొక్కేము. ఎన్నో తీర్థ యాత్రలు

సేవించాము. అన్ని రకాల పరీక్షలూ వైద్యాలూ మేమిద్దరం చేయించుకున్నాము. దీని కడుపున మరోకాయ కాయకూడదా! నాకు ఒక్కడే కొడుకు మళ్ళీ అదేనా టాపిక్!

బియస్సీ ఫస్టుక్లాసులో ప్యాసయ్యాడు మా వాడు. బాంకు ఆఫీసరుగా పోస్టింగ్సు వచ్చాయి. కానీ చూస్తున్నాం కదా లోకం తీరు....... వీడు నన్ను ఉద్ధరిస్తాడా రేపు?.....

తలచుకుంటే రోజు గడవడంలేదు. రాత్రి అయితే తెల్లారడం లేదు. నాకు జరిగిన అన్యాయం గుర్తించావా, నాకు ఒక్కడే కొడుకు! వెంటనే పోస్టుకార్డు తీసి ఒక్క లైను అడ్డంగా రాసి పడేశాను.

'కైన్ ఐ బి ఆఫ్ సమ్ హెల్ప్?'

నిజంగా రాసినప్పుడు ఏ పాపపు చింతా నా మనసులో లేదు. కాని వాడి జవాబు చూస్తే ఇప్పుడు తెలుస్తోంది. (నీకు ఒక్క కొడుకు. ఒక్కగా నొకడు అని విన్నాను. నువ్వు ఆపదలో వున్నావని గ్రహించాను. ఈ విషయంలో) నన్నేమైనా సహాయం చెయ్యమంటావా ఏం? అని! అదెలా అర్థమై వుంటుందో పెద్దలు తమరే ఊహించ గలరు.

★